టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చిత్తూరు రూరల్ మండలంలో టిడిపి గ్రామ కమిటీల ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు మారుతి పర్యవేక్షణలో చిత్తూరు రూరల్ పరిధిలో నాయని చెరువు, తుమ్మిందపాళ్యం, తొప్పాతిపల్లి, పెద్దిశెట్టిపల్లి, చెర్లోపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామకమిటీ ఎన్నికలు నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, మండల కన్వీనర్ శశికర్ బాబు, కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం..

చిత్తూరులో..

పూతలపట్టులో..

పలమనేరులో..

గంగవరంలో..

చౌడేపల్లిలో..

యాదమరిలో..

ప్రజాశక్తి- పూతలపట్టు: బిజెపి ప్రభుత్వం తిరిగి కార్మికులను అణగదొక్కే ప్రయత్నం చేస్తుందని, తమ ప్రయత్నాన్ని తక్షణమే విరమించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మండిపడ్డారు. గురువారం మే డే సందర్భంగా మండలంలోని బండపల్లి గ్రామంలో ఘనంగా సిఐటియు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్మికులు 8 గంటల పనివిధానం పోరాడి సాధించారని మళ్ళీ 12 గంటలు పనివిధానం తీసుకొస్తే కార్మికోద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మరోవైపు కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ కార్పొరేట్ యాజమాన్యాలకి అనుకూలంగా మోడీ ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమని లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మే డే స్ఫూర్తితో కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిరావు ఆధ్వర్యంలో 200 మందికి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. యూనియన్ జిల్లా నాయకులు అయ్యప్ప, గంగాధరం, బాబు, రజిని పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: శ్రమదోపిడికి వ్యతిరేకమే మే డే అని జిల్లా పంచాయతీ పారిశుధ్య కార్మికుల అధ్యక్షులు మధు అన్నారు. గురువారం మండలలోని తగ్గువారిపల్లిలో మే డేని పురస్కరించుకుని సీఐటీయూ జెండా ఆవిష్కరణ కార్యక్రమం మండల పారిశుధ్య కార్మికుల సభ్యులు కన్నయ్య ఆధ్వర్యంలో జరిగింది. రైతు సంఘ జిల్లా కార్యదర్శి శంకరన్, పారిశుధ్య కార్మికులు మొగిలమ్మ, చిట్టెమ్మ, బాలాజీ, ప్రభాకర్, దాసు, అల్లా బాషా, భవన నిర్మాణ కార్మికులు షబ్బీర్, సోము, గోవిందస్వామి పాల్గొన్నారు.

శాంతిపురం: శాంతిపురం ప్రాజెక్టు అంగనవాడీ వర్కర్లు మే డే సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్లు సిఐటియు జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచి పెట్టారు. ప్రాజెక్ట్ లీడర్ శోభారాణి, నాయకులు గీతాంజలి, శైలజ, సుభాషిని పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక అంబేద్కర్ భవనం వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు జెండావిష్కరణ చేశారు. ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర, వీఆర్ఏ సంఘ నాయకులు ప్రకాష్, దేవేంద్ర, పిచ్చయ్య, ఐకెపి సంఘ నాయకులు మనీ, చంద్రబాబు, సిఐటియు ప్రాజెక్ట్ కార్యదర్శి పద్మ, వ్యకాసం నాయకులు అమరనారాయణ, పాకాల సుబ్రహ్మణ్యం, గోపి పాల్గొన్నారు.

వి కోట : వి కోట గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పారిశుద్ధ కార్మికులు సిఐటియు జెండాను ఆవిష్కరించి మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు సంపత్, జిల్లా కార్యదర్శి తంగరాజు, సిఐటియు నాయకులు కృష్ణయ్య, వెంకట రమణయ్య, రమణ, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట వాణిజ్య కూడలిలో అంబేద్కర్ ఆటో యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మేడే సందర్భంగా జెండా ఎగురవేసి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. మహాత్మా గాంధీ ఆటో యూనియన్ అధ్యక్షుడు మురుగేష్, సెల్వం విజయకుమార్, వెంకటేష్, ధనంజయ, జీవరత్నం, విష్ణు, సురేష్, గోపి పాల్గొన్నారు. అలాగే విలాస వరహాపురం పంచాయతీలో పారిధుశ్య, పంచాయతీ కార్మికులను తెలుగు సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి దుశ్శాలతో సన్మానించి స్వీట్ అందించారు.

పుంగనూరు: కార్మికుల హక్కుల పోరాటాలతో పుట్టుకొచ్చిన పండుగ ఈ మేడే అని సిఐటియు కార్యదర్శి ఏల్యూరు మురళి అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక ఇందిరా సర్కిల్లో భారత్ ఆటో స్టాండ్‌లో సిఐటియు మే డే జెండాను ఆవిష్కరించారు. సంకల్ప సొసైటీ ఆధ్వర్యంలో రాజా, సురేష్ కుమార్, ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌కే. అయూబ్ ఖాన్, మాల మహానాడు నాయకుడు శంకరప్ప ఆటో డ్రైవర్లకు శాలవాలతో ఘనంగా సన్మానించి మేడే వేడుకలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మధుసూదన్ కేక్ కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు.

చిత్తూరు అర్బన్: మే డే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్తూరు రైల్వే స్టేషన్ ప్రధాన రహదారిలో జాగ్రి హమాలీ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన కార్యక్రమం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తండ్రి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు పాల్గొని మే డే జెండా ఆవిష్కరించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే స్ఫూర్తితో జర్నలిస్టులు హక్కుల కోసం ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జయరాజ్, జిల్లా అధ్యక్షులు ప్రకాష్ పిలుపునిచ్చారు. మే డేని పురస్కరించుకొని స్థానిక ఏపీడబ్ల్యూ జేఎఫ్ జిల్లా కార్యాలయంలో మేడే జెండాను ఆవిష్కరించారు. నాయకులు కేశవులు, బాలసుబ్రమణ్యం, మురళీకృష్ణ, నాగరాజు, యాగవేందర్ రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, కుబేంద్ర, ఉదయ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు

సిఐటియు ఆధ్వర్యంలో.. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. గాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడారు. ఉపాధ్యాయ యూనియన్ జిల్లా కార్యదర్శి పార్ధసారథి, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేంద్ర, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, సిఐటియు నాయకులు దాసు, బాలసుబ్రమణ్యం, చిట్టెమ్మ పాల్గొన్నారు.

యాదమరి: మండల కేంద్రంలో మేడే సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి సురేంద్ర సిఐటియు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, సంఘమిత్రలు, గ్రామ సేవకులు, అసంఘటిత కార్మికులతో మేడే ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు షకీలా, తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లి: స్థానిక బస్టాండ్‌లో సిఐటియు, ఏఐటీయూసీ, ఏపీడబ్ల్యూజేఎఫ్ అనుబంధ సంస్థలకు చెందిన కార్మికులు ఎర్రజెండాలతో మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ నుంచి డప్పులతో ర్యాలీ నిర్వహించి సంత గేటు వద్ద పంచాయతీ కార్మికులచే నిర్మించిన ఎర్రజెండాను ఆవిష్కరించారు. నాయకులు డాక్టర్ చంద్ర, బ్యాంకు రెడ్డప్ప, వాసు కృష్ణమూర్తి, శేఖర్ కూరపర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం దేవలంపేటలో మేడే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో నూతనంగా అంబేడ్కర్ ఆటో యూనియన్ ఏర్పాటు చేశారు. యూనియన్ అధ్యక్షులుగా మోహన్‌ని ఏకగ్రీవంగా న్నుకున్నారు. రిటైర్డ్ ఎస్ఐ రావిల్ల పట్టాభి నాయుడు, టిడిపి యువనేత బాష్యం సతీష్ నాయుడు పాల్గొని యూనియన్‌కు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

కుప్పం టౌన్ : పట్టణంలో మేడే వేడుకలకు ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, కడా పీడీ వికాస్ మరమ్మాత్ పాల్గొన్నారు. ఈ వేడుకలలో భాగంగా కార్మిక సమస్యలపై ఆరా తీస్తూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, పురపాలక సంఘ అధ్యక్షులు సెల్వరాజు, మాజీ ఎంపీపీ సాంబశివం, డీకే పల్లి మణి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం : కార్వేటినగరం, అమ్మపల్లిక్రాస్ రోడ్డు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సిఐటియులోని పలువురు మాట్లాడుతూ కార్మికులు కృషి ఫలితమే మేడేను జరుపుకుంటామన్నారు. మమతా, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: కార్మికుల శ్రమను గుర్తించి గౌరవిద్దామని జైన్ ఎంప్లాయిస్ యూనియన్ వైఎస్ఆర్ టీయుసి అధ్యక్షులు కలిజవేడు సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మేడే సందర్భంగా మండలంలోని జైన్ ఫ్యాక్టరీ వద్ద జెండా ఎగురవేసి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, సురేష్, సుబ్రమణ్యం, భూపతి, జలంధర్ పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలో మేడే సందర్భంగా టిడిపి నేతలు, కార్మికులు బందార్లపల్లి క్రాస్ వద్ద నుంచి ర్యాలీ చేపట్టి బజారు వీధిలో టపాకాయలు, బాణాసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టుకున్నారు. కార్మికుల నాయకుడు, స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్ట్ దివంగత నేత డాక్టర్ రాజన్ కుటుంబ సభ్యులు పారిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ చేసి, అన్నదానం ఏర్పాటు చేశారు. రాష్ట్ర నేతల మునస్వామి, నారాయణ చారి, టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరులో సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు జరిగాయి. సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా సిఐటియు జెండాను ఎగురవేశారు. హమాలీ యూనియన్ హైదరవల్లి, శంకర, జయచంద్ర, బిల్డింగ్ యూనియన్ శ్రీరామయ్య, సుధాకర్, రత్తమ్మ, జయంతి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: కార్మికులకు కనీస వేతనాన్ని అందజేయాలని మండల మాల మహానాడు అధ్యక్షులు టిఎం మంజునాథ్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య, మండల యూత్ లీడర్ వెంకటేష్, ఖాదర్, గంగులప్పా, గంగన్న, శివన్న, రెడ్డప్ప, శ్రీనివాసులు యల్లప్ప పాల్గొన్నారు.

శాంతిపురంలో..

రామకుప్పంలో..

ఎస్ఆర్ పురంలో..

పెద్దపంజాణిలో..

వీకోటలో..

బంగారుపాళ్యంలో..

పుంగనూరులో..

'పౌల్ట్రీ' ద్వారా ఉపాధి కల్పనకు చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో రైతులు వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆరిఫ్‌తో కలిసి పౌల్ట్రీ రంగంలో ఉపాధి అవకాశాల నిమిత్తం ఆసక్తి ఉన్న రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగాల ద్వారా ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. పౌల్ట్రీ రంగంలో ఆసక్తి ఉన్న రైతులకు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో ముందుగా పౌల్ట్రీ రంగంలో విజయవంతమైన రైతులతో తగు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రంగంలో ఆసక్తి ఉన్న రైతులకు పౌల్ట్రీ ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయం నిమిత్తం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపడతామని ఇందుకు అవసరమైన డిపిఆర్‌లను రైతులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ఏడీల ద్వారా వారి పరిధిలో ఉన్న రైతుల్లో పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగంలో ఆసక్తి ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలని అందుకు అనుగుణంగా అవసరమైన ఆర్థికసాయం అంశంపై బ్యాంకులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఇందుకు జిల్లాస్థాయిలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కమిటీకి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందజేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఈసీ మెంబర్ రమేష్ మాట్లాడుతూ పౌల్ట్రీ రంగంలో ఆసక్తి ఉన్న రైతులు మాత్రమే ఈ రంగంలో రాణించగలరని వారికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను మా సంస్థ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్ఈసి జోనల్ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, యాదమరి, బంగారుపాళ్యం మండలాల రైతులు పాల్గొన్నారు.

గ్రాసం అందేనా..?

- మూగజీవుల కడుపు నిండేనా..
- పశు పోషణకు సవాళ్లు..
- ఆందోళనలో పాడి రైతులు



ప్రజాశక్తి- పూతలపట్టు: పశు సంపదకు సరిపడ గ్రాసం దొరకడం లేదు. ఈ పరిస్థితిల్లో వచ్చే ఖరీఫ్ దాకా ఎలా నెట్టుకు రావాలన్నది రైతులకు, ప్రభుత్వానికి సవాలుగా మారింది. గతంలో రైతులు ధాన్యంతో పాటు ఎండుగడ్డిని భద్రపరుచుకునేవారు. ఒక ప్రాంతంలో కొరత ఏర్పడిన సమీప ప్రాంతంలో అందుబాటులో ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. వెరసి గ్రాసం కొరతకు దారి తీస్తోంది. ప్రస్తుతం గ్రాసం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వేలకు వేలు ఖర్చు చేసిన గ్రాసం దొరకడం ఇబ్బందికరంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మూగజీవాలు ఇండ్లకే పరిమితమై గ్రాసం కోసం రోధిస్తున్నాయి. భూములు ఉన్న రైతులు గ్రాసం పెంచుకుంటూ జీవాలను కాపాడుకుంటున్నారు. సొంత భూములు లేని పాడి రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

సాంకేతికత అందుబాటులోకి..

వరి కోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో నూర్పుళు చేయడానికి ఎక్కువ సమయం పట్టడంతో రానురాను రైతులు ఈ పద్ధతికి స్వస్తిపలికారు. తక్కువ ఖర్చు కొద్దిపాటి సమయంలో దాన్యం ఇంటికి చేరిపోతుందని భావనతో వరి కోత యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఏ ప్రాంతంలో చూసినా 80 శాతానికి పైగా యంత్రాల సాయంతోనే కోతలు కోస్తున్నారు. యంత్రంతో కోత కోసేటప్పుడు గడ్డి ముక్కలుగా అవడం వల్ల దాన్ని పొలంలోనే వదిలేస్తున్నారు. మిగిలిన శాతం మాత్రమే నూర్పుళ్ళకు అవకాశం ఉంటుంది. దీంతో రైతులకు నామమాత్రంగానే ఎండు గడ్డి లభ్యమవుతుంది. జిల్లాలో ఈసారి వరి తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో కొరత మరింత తీవ్రంగా ఉంది.

ప్రత్యామ్నాయం..

ఒక పశువుకు రోజుకు కనీసం 15 నుంచి 20 కిలోల ఎండిగడ్డి అవసరం అయితే 20 నుంచి 40 కిలోల వరకు పచ్చిగడ్డి కావాలి. వరిగడ్డిలో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల అరుగుదల బాగుంటుంది పశువులకు మేత సంతృప్తిగా తిన్న భావన కలుగుతుంది. వరిగడ్డి ట్రాక్టర్ రూ. 9వేల నుంచి రూ.12వేల వరకు ధరలు పలుకుతోంది. అయితే గడ్డి కొని పశువులను మేపలేని పరిస్థితి. పాతర గడ్డి- ఎండు గడ్డి కొరతను అధికమించడానికి

సరైన వర్షాలు లేక ఒకవైపు ప్రజలు దాహంతో కేకలు పెడుతుంటే.. మరోవైపు మూగజీవాలు గ్రాసం అందక విలవిల లాడుతున్నాయి. వర్షాభావంతో ఎక్కడ పచ్చిగడ్డి లేకపోవడంతో మూగ జీవాలు ఇండ్లకే పరిమితమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మూగజీవాల పోషణ పాడి రైతులకు భారంగా మారుతుంది. కొందరు రైతులు జీవాలను పోషించుకోలేక తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోంది.

గతంలో శైలేజ్ (పాతర గడ్డి)ని బేళ్ల రూపంలో తయారుచేసి టిడిపి ప్రభుత్వంలో రాయితీతో కిలో రెండు రూపాయలు చొప్పున అప్పట్లో రైతులకు సరఫరా చేసింది. మందంగా ఉంటే పాలిథిన్ కవరులో గాలి దూరకుండా గడ్డి చుట్టి ఉంచుతారు. దాన్ని మూడేళ్ల వరకు వాడుకోవచ్చు. వీటితోపాటు రాయితీ గడ్డి విత్తనాలు ప్రభుత్వం ఇస్తోంది నీటి ఆధారం ఉన్న రైతులు కొంత పొలంలో పచ్చి గడ్డి పెంచుకుంటే కొరత తీరుతుంది.

150 మెట్రిక్ టన్నుల గ్రాసమవసరం

ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలానికి గడ్డి కొరత ఉందని ప్రభుత్వం గుర్తించింది. అందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యచరణ ప్రణాళికల సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించింది. పూతలపట్టు మండలంలో మొత్తం 30వేల మూగజీవాలు ఉన్నాయి. వీటికి రోజుకు కనీసం 15 మెట్రిక్ టన్నుల గ్రాసం అవసరం ఉంది.

త్వరలో సబ్సిడీతో దానా..

- గీతారెడ్డి, మండల పశుసంవర్ధక శాఖ అధికారి

మండలంలో నెలకొన్న గ్రాసం కొరతలో భాగంగా త్వరలో పాడి రైతులకు సబ్సిడీతో దానం పంపిణీ చేయనున్నాం. 50 కేజీల దానా రూ.555లకు అందించనున్నాం. ఇందుకు మండలంలో పూతలపట్టు, వావిల్ తోట, తలుపులపల్లి, గొడుగు చింత, పి.కొత్తకోట, ఐదు పాయింట్లు ఏర్పాటు చేసి రైతులకు దానా పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తాం.

పరుగులు తీసినా..

ప్రాణాలను కాపాడుకోలేకపోయాడు..

మృతి చెందిన లారీ డ్రైవర్ అలగర్

ప్రజాశక్తి -పూతలపట్టు: తన ప్రాణాలను కాపాడుకోవాలన్న ఆతృతతో.. ప్రాణ భయంతో పరుగులు తీసినా చివరికి ఓడిపోయి ప్రాణం విడిచాడు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అలగర్ ఒక ప్రైవేట్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పూతలపట్టు పోలీస్‌స్టేషన్ సమీపానికి రాగానే గుండెపోటు వచ్చింది. విషయాన్ని గమనించిన వ్యక్తి వెంటనే లారీని రోడ్డు పక్కన ఆపి పక్కనే ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రికి పరుగులు తీశాడు. ఆసుపత్రిలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు చూస్తుండగానే అక్కడే కుప్పకూలి మృతి చెందిన సంఘటన పలువురి హృదయాలను కలిసి వేసింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ

కిషోరి వికాసం సమ్మర్ క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కిషోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. గురువారం జిల్లా సచివాలయంలో జిల్లా కలెక్టర్ కిషోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ పోస్టంను ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమ్మర్ క్యాంపెయిన్ గ్రామ, వార్డు స్థాయిలో కిషోరి బాలికల సాధికారత కొరకు రూపొందించబడిందని, విద్య ప్రాముఖ్యత, రుతుస్రావ ఆరోగ్యం, వ్యక్తగత పరిశుభ్రత, పోషకాహారం, ఉన్నత విద్య, కెరీర్ మార్గదర్శనం, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, సైబర్ భద్రత, చైల్డ్ హెల్ప్ లైన్ సేవల వినియోగం, స్వీయరక్షణ, ఆర్థిక నిర్వహణ, నాయకత్వం, నిర్ణయాధికారం, లింగ వివక్ష, పునరుత్పత్తి ఆరోగ్యం, శారీరక వ్యాయామం, యోగా వంటి పలు అంశాలపై వారికి వేసవి సెలవులలో అంగన్వాడీ, సచివాలయ కేంద్ర పరిధిలో షెడ్యూల్ ప్రకారం శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తమ నియంత్రణలో పనిచేసే ఫీల్డ్‌స్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేయాలని, కిషోర్ వికాసం సమ్మర్ క్యాంపెయిన్‌ను ఈనెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు విజయవంతంగా అమలు చేయడానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లులు, గ్రామ, వార్డు స్థాయి బాలల సంక్షేమ, సంరక్షణ కమిటీ సమావేశాలు 2వ తేదీ శుక్రవారం అన్ని సెక్రటేరియట్‌లలో తప్పనిసరిగా నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో గ్రామ, వార్డుస్థాయి వనరుల బృందం, మహిళా పోలీసు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వీఓ నాయకురాలు, సభ్యురాలు, విద్యా కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన క్యాలెండర్ ప్రకారం నిర్దేశిత రోజున ఆయా అంశాల మీద సంబంధిత రిసోర్స్ పర్సన్ ద్వారా అవగాహనా తరగతులు (గ్రూపు చర్చలు) నిర్వహిస్తారని, ఇందుకు సంబంధించి మహిళా పోలీసులు సదరు కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా ప్రధాన భూమిక పోషిస్తారని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణా అధికారి సుబ్రమణ్యం, లీగల్ ఆఫీసర్ వెంకటేశ, ప్రొటెక్షన్ అధికారులు శివ, రాధ తదితరులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌గా ప్రసన్న కుమార్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి మండల తహశీల్దార్‌గా ఎంఎస్. ప్రసన్న కుమార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడున్న తహశీల్దార్ మాధవరాజు బదిలీ కావడంతో శాంతిపురం మండలం డిప్యూటి తహశీల్దార్‌గా పనిచేస్తున్న ప్రసన్న కుమార్ బైరెడ్డిపల్లి మండల తహశీల్దార్‌గాబాధ్యతలు చేపట్టారు. నూతన తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వెదురుకుప్పం వాసికి ఉన్నత ఉద్యోగం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ఆగిచేనుపల్లె గ్రామ పంచాయతీ, కొత్తూరు గ్రామానికి చెందిన కె.రామచంద్ర రెడ్డి, జయలక్ష్మి కుమారుడు కె.సుధాకర్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో ఆదాయపు పన్ను శాఖ కౌన్సిలర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం గ్రామస్తులు సుధాకర్ రెడ్డిని అభినందించారు. సుధాకర్ రెడ్డి చిన్నతనం నుంచి కష్టపడి చదివి తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో ఆదాయపు పన్నుశాఖ తరపున సీనియర్ స్టాండింగ్ కౌన్సిలర్‌గా నియమించబడడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు.

దేవరకొండలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామం సమీపంలో గల దేవరకొండలో గురువారం ఏనుగుల గుంపు సంచారం చేస్తున్నట్టు స్థానికులు తెలిపారు. అటవీ శాఖ సిబ్బంది ట్రాక్టర్స్ ద్వారా ఏనుగులను గ్రామాలకు పొలాలకు రానికుండా మళ్ళిస్తున్నట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

వన్నెకుల క్షత్రియుల అభివృద్ధి టిడిపితోనే..

ప్రజాశక్తి- కుప్పం రూరల్: వన్నెకుల క్షత్రియుల అభివృద్ధి టిడిపిలోనే సాధ్యమని వన్యకుల క్షత్రియ సాధికార కమిటీ అధ్యక్షులు మునిరాజు తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం టిడిపి పిసి సాధికార కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాణిపాకం వెంకటేష్ సమక్షంలో పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటర్లు కలిగిన సామాజిక వర్గం వన్యకుల క్షత్రియులేనని, అలాంటి సామాజిక వర్గాన్ని గుర్తించిన ఏకైక పార్టీ తెలుగుదేశమేనని అన్నారు. వన్నెకుల క్షత్రియలను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు.

ఫిర్యాదుల స్వీకరణ వచ్చేవారం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కార్యాలయం ప్రజా దర్బార్‌లో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల ఈ శుక్రవారం 2వ తేదీ నిర్వహించడం లేదని ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం వచ్చేవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందన్నారు. చిత్తూరు నియోజకవర్గ ప్రజలు పై విషయాన్ని గమనించాలని కోరారు.

97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ప్రజాశక్తి- గుడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజల వద్ద పెన్షన్ అధికారులు లంచం అడిగితే తమకు వివరాలు తెలపాలని ఎంపీడీవో ఎన్.రాధాకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 19 పంచాయతీలో 1వ తేదీ 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యిందని, ఇంకా తీసుకోని వారు 2వ తేదీ సచివాలయం వద్ద తీసుకోవాలని తెలిపారు.

ట్యూనా.. భలే స్టామినా..

- చేపలతో గుండె భద్రం
- 2న ప్రపంచ ట్యూనా చేపల దినోత్సవం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ట్యూనా చేప మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా ఆహారంగా ఉపయోగించబడే ఒక ఉప్పు నీటి చేప. దీనిని కేరా చేప లేదా చూర అని కూడా పిలుస్తారు. ఈ చేపలను అతిగా వేటాడడం, ట్యూనా చేపలను రక్షించి భావితరాలకు అందించడం వంటి లక్ష్యాలతో ప్రపంచవ్యాప్తంగా మే 2వ తేదీన ట్యూనా చేపల దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు జరుపుకొంటారు. ఫిలిప్పీన్స్‌లోని జనరల్ శాంతోస్ అనే పట్టణంలో ప్రధానంగా ట్యూనా ఫెస్టివల్ జరుగుతుంది. అందులో భాగంగా వంటల పోటీలు, వీధి కవాతులు, నృత్య ప్రదర్శనలు వంటివి జరుగుతాయి. సముద్రపు ఆహారపు గొలుసులో ట్యూనా ఒక ప్రధానమైన పాత్ర వహించే జీవి. ఇది సముద్రంలో ఇతర జీవుల జనాభాను అదుపులో ఉంచుతుంది.

పోతపాలు మురళీ కృష్ణ
జంతు శాస్త్ర అధ్యాపకులు
కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిత్తూరు

గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ క్రీస్తుపూర్వం 350లో రాసిన అనిమల్ హిస్టరీ అనే పుస్తకంలో ట్యూనా చేపలను ప్రస్తావించాడని చరిత్రకారులు గుర్తించారు. ట్యూనా చేపలను అధికంగా ఆహారంగా ఉపయోగిస్తారు. కాబట్టి దీనిని చికెన్ ఆఫ్ దిసి అని కూడా పిలుస్తారు. ట్యూనా చేపల మాంసం మృదువుగా, తేమగా, ముదురు గులాబీ రంగులో ఉంటుంది. ఇది ఒకే ఒక్క ఎముక కలిగిన కండగల చేప. సుమారు ఒకటిన్నర కిలోల నుండి ఒక గుర్రం బరువు గల పరిమాణం వరకు పెరగగలదు. ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఇది ప్రసిద్ధమైన రుచికరమైన మాంసంగా పరిగణించబడుతున్నది. ట్యూనా చేప మాంసంలో అధిక పరిమాణంలో

ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి గుండె ధమనులలో పేరుకుపోయిన ఒమేగా -6 కొవ్వు ఆమ్లాలు, ఎల్‌డిఎల్ వంటి చెడు కొలెస్ట్రాల్‌లను తగ్గిస్తాయి. ఒమేగా త్రీ కొవ్వులను తినడం వల్ల గుండెపోటుతో సహా హృదయసంబంధ వ్యాధులు తగ్గుముఖం పడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేకాకుండా ట్యూనా చేపల మాంసం మంచి పోషక విలువలను కలిగి ఉంటుంది. సముద్రం అందించే ఆహారంలో ట్యూనా ఉత్తమమైనది. అందువల్ల చాలామంది దీనిని సముద్రం రాజుగా భావిస్తారు. ట్యూనా చేప మాంసంలో విటమిన్ సి, బి టు బి త్రీ బి 6 బి 9, డి అలాగే జింక్, మాంగనీస్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని హానికరమైన పదార్థాలను తొలగించి, వ్యాధుల నుండి రక్షణ ఇస్తాయి. కాబట్టి పోషకాహార నిపుణులు ట్యూనా చేప మాంసాన్ని సూపర్ ఫుడ్‌గా వర్ణిస్తారు.

త్రీ వీలర్ బైక్ అందజేత



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: నిరుద్యోగ దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ చొరవతో నెల్లేపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన వనజకు మూడు చక్రాల బైక్‌ను అందజేశారు. అనంతరం దివ్యంగురాలకు పెన్షన్ డబ్బు శ్రీధర్ యాదవ్ పంపిణీ చేశారు. టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సచివాలయం సర్వేయర్ మధు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి- శాంతిపురం: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కుప్పం పార్టీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ భరత్, మాజీ రెస్కో చైర్మన్ సందీప్ ఆధ్వర్యంలో శాంతిపురం వైసిపి నేతలు గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి మండల సమస్యల గురించి జగన్మోహన్ రెడ్డికి తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. వారివెంట నడింపల్లి చలపతి, కడపల్లి మురుగేష్ తదితరులు ఉన్నారు.

తిరుమలలో వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో గురువారం సాయంత్రం అర్ధగంటసేపు కురిసిన వర్షానికి యాత్రికులు సేద తీరారు. గత కొన్నాళ్లుగా వేసవి ప్రతాపంతో అల్లాడిపోయిన యాత్రికులు, స్థానిక దుకాణ దారులు వేసవి తాపం నుండి ఉపశమనం పొందారు. గురువారం సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం వేగమందుకుంది. శ్రీవారి ఆలయం, తిరుమల బస్టాండు, సీ.ఆర్.ఓ అతిధి గహాల కేటాయింపు ప్రాంతం, లడ్డు కౌంటర్లు, వైకుంఠం క్యూ ప్రాంతాల్లో యాత్రికులు తడుస్తూనే వేసవి ఉపశమనం పొందారు. సాయంత్రం నుండి తిరుమల మొత్తం చల్లగా మారి ఆహ్లాదకరంగా మారింది. రోడ్లపై నీరు పలు ప్రాంతాల్లో నిలిచి పోవడంతో ఆరోగ్యశాఖ సిబ్బంది నీటిని సకాలంలో తొలగించారు.

పింఛన్లతోనే పేదలకు భరోసా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పింఛన్లతోనే పేదలకు భరోసా అని పూతలపట్టు శాసనసభ్యులు కే.మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పథకాలను చేపడుతున్నదని సూపర్ సిక్స్ హామీలలో ఒకటొకటిగా అమలు చేస్తూ ప్రజలకు దగ్గరవుతున్నామని ఇదివరకే పెంచిన పింఛన్లు పంపిణీ ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేపట్టామని, ఈనెల విద్య వందనం పథకంను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ధరణి ప్రసాద్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ..!

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి ఆర్థిక అభివృద్ధి పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ కేంద్రం వద్ద రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తుందన్నారు. రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూలీల ఖర్చు తగ్గించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించడం జరుగుతోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రేయర్లు, ట్రాక్టర్ మడకలు, రోటివేటర్లు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ రెడ్డి, సీతాపతి, గంట్లప్ప గౌడు, మహమ్మద్ రఫీ, గుర్రప్ప, వెంకట్రామ గౌడు, కామరాజు నాయక్, జయశంకర్, మనోహర్, గజేంద్ర,విశ్వనాథ్ వెంకటాచలం, సుబ్రి, బాలు, అవినాష్, కృష్ణారెడ్డి, ఏఓ అమృత,వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకురండి..

జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు

ప్రజాశక్తి- యాదమరి: చెత్త నుండి సంపద కేంద్రాలు వాడుకులకు తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని వరదరాజులపల్లి గ్రామపంచాయతీని ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలో ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కోనాపల్లి, పెర్యంబడి గ్రామ సచివాలయ పరిధిలోని చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీలు పరిధిలోని ఇళ్ళ చుట్టూ రోడ్ల ఇరువైపులా ఉన్న పేడ దెబ్బలు చెత్తలను పూర్తిగా తొలగించాలన్నారు. పారిశుధ్య చర్యలకు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు త్వరగా తీసుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కువగా వ్యాధులు నీటి ద్వారానే వ్యాప్తి చెందుతాయని దీన్ని అరికట్టేందుకు ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా సరైన పరిష్కార అన్నారు. ఇందుకు రక్షిత మంచి నీటి ట్యాంక్ ను నెల రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని తెలిపారు. రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకుల పరిసరాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సరఫరా చేసే నీటిలో ఎక్కడా పైప్ లైన్లు కలుషితం కాకుండా సురక్షిత మంచినీరు వారికి చేరేలా చూసే విషయంలో సెక్రటరీలు శ్రద్ధ పెట్టాలన్నారు. దీనితోపాటు బోర్ వెల్స్ వద్ద నీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా సద్వినియోగం చేయాలని, ఎమ్ బుక్కును పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. పిఓపి ఆర్ డి సుకుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న సుధాకర్ రావు

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్వేర్ ఉద్యోగి మృతి

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవితేజ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- పుంగనూరు: ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో సాఫ్ట్వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం అండీగానిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కేశవులు కుమారుడు రవితేజ (26) సొంత పనిపై పుంగనూరుకు వస్తుండగా మదనపల్లి నుండి వేలూరుకు వెళుతున్న ప్రైవేటు బస్సు పట్టణానికి సమీపంలోని ఓం శక్తి ఆలయం ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రవితేజ తలకు తీవ్రమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన జరిగిన వెంటనే జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ నియంత్రించారు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన తెలిసిన వెంటనే మృతుని తల్లిదండ్రులు, అక్క చెల్లెల్లు ఆసుపత్రి ఆవరణ వద్ద చేరుకొని బోరున విలపించడం పలువురిని కలిచివేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో బైక్ దొంగ

పోలీసులు అదుపులోనికి తీసుకున్న ద్విచక్ర వాహనాలు, నిందితుడు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : ద్విచక్ర వాహనాల దొంగను అదుపులోనికి తీసుకుని, అతని నుంచి రాయల్ ఎన్ఫీల్డ్ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండల పరిధిలో ఏప్రిల్ 28, 29 తేదీలలో ద్విచక్ర వాహనాలు వరుస దొంగతనాలకు గురైనట్టు కేసులు నమోదు అయిందన్నారు. ఈ విషయమై కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆదేశాల మేరకు రూరల్ సీఐ గుడుపల్లి ఎస్సై శ్రీనివాసులు, ఐడి పార్టీ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని పొగురుపల్లి ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి అనుమానాస్పదంగా వ్యవహరిస్తూ, పోలీసుల నుండి తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించినట్టు తెలిపారు. వారిని అదుపులోనికి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులుగా గుర్తించామన్నారు. ఈ వ్యక్తి కుప్పం పట్టణం మోడ్రన్ కాలనీకి చెందిన సతీష్ కుమార్‌గా గుర్తించామని, నిందితుడిపై గతంలో సైతం పలు కేసులు ఉన్నట్టు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు పోలీసులు తెలిపారు.

విశ్రాంతి ఆర్మీ ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి- పుంగనూరు, పెద్దపంజాణి: విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా కారు ఢీకొనడంతో విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి తీవ్ర గాయాలు అయ్యాయి. పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చౌడేపల్లి మండలం చారాల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనివాసులు రెడ్డి (50) విశ్రాంత ఆర్మీ ఉద్యోగి. పెద్దపంజాణి మండలం కమ్మి నాయనపల్లి గ్రామ సమీపంలో ఉన్న హెచ్‌పిసియల్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా తిరుపతి నుండి కోలార్ వెళ్లేందుకు గూగుల్ మ్యాప్ ఆధారంగా ఆ రోడ్డుపై వచ్చిన కారు ఢీకొన్నది. ప్రమాదంలో శ్రీనివాసులు రెడ్డి కాలికి బలమైన గాయాలు అయ్యాయి. పుంగనూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

పుంగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులు రెడ్డి

రసాయనాలతో...మామిడి 'రసాలు'

- తేరకముందే మందులతో మగ్గబెట్టేస్తున్నారు
- మార్కెట్లోకి మిలమిల మెరిసేలా పండ్లు
- కార్బైడ్, చైనా పొడిపై సర్వత్రా ఆందోళన
- చోద్యం చూస్తున్న ఆహారతనిఖీ, విజిలెన్స్
- తమకేమీపట్టనట్లు ప్రజారోగ్యశాఖ తీరు...

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్

సీజన్ ప్రారంభానికి ముందే.. మార్కెట్లోకి మిలమిల మెరుస్తూ మామిడి వచ్చేసింది. కాయలు తేరక ముందే ..రసాయనాలతో మగ్గబెట్టి రసాలంటూ దర్జాగా అమ్మేస్తున్నారు. కార్బైడ్, ఇథలీన్, చైనా ప్యాకెట్ల పొడితో రంగు తేల్చి మరీ ప్రజలకు అంటగడుతున్నారు. వీటిని తినడం వల్ల అనారోగ్యంతో పాటు, కేంద్రనాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయినా ఆహార తనిఖీ, విజిలెన్స్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా రసాయనాల వాడకాన్ని ఆహార చట్టం ప్రకారం పూర్తిగా నిషేధించినా దర్జాగా వాడేస్తూ ప్రజారోగ్యాన్ని గుల్ల చేస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

పండక ముందే .. మార్కెట్లోకి !

దేశంలోనే మామిడి ఎగుమతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25 హెక్టార్లలో ఏటా సగటున 8 లక్షల టన్నుల మామిడి దిగుబడి ఉంటోంది. అయితే జిల్లాలో మామిడి రసాలు..(బేనిషా, ఖాదర్, కాలేపాడు)లాంటి ఇంకా సరైనా బరువునే సంతరించుకోలేదు. పక్వానికి రావడానికి ఇంకా 20 నుంచి నెల రోజుల పైనే పడుతుంది. అయినా రసాయనాలతో మగ్గించిన పండ్లు ..చిత్తూరు, తిరుపతి, పీలేరు. కాళహస్తి ప్రాంతాలలో విరివిగా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చేసింది. గతేడాదీ..ఇలా మే నెల మొదట్లోనే మామిడి పండ్లు మార్కెట్లోకి రావడంతో కొందరు ఆహార తనిఖీ, విజిలెన్స్ అధికారులు వరుసగా మామిడి దుకాణాలపై హడావుడి చేశారు. ప్రధానంగా తిరుపతి మార్కెట్ యార్డులో కొందరు దుకాణదారులపై దాడులు చేసి, తనిఖీల్లో చైనా నుంచి దిగుమతి చేసుకున్న ఇథలీన్ ప్యాకెట్లతో పండ్లను మాగబెట్టేందుకు వినియోగిస్తున్నారని గుర్తించారు. అయితే చర్యలు మాత్రం తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఏడాదీ మళ్లీ మార్కెట్లోకి విరివిగా మందులతో మగ్గబెట్టిన మామిడి వచ్చినా ఇప్పటి వరకూ అధికారులెవరూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

ప్రత్యామ్నాయ పద్ధతులున్నా...

రసాయనాల బదులు సురక్షిత పద్ధతుల్లో మాగబెట్టే విధానాలు చాలా ఉన్నా వీటిని ఆచరించడం లేదు. కార్బైడ్ వినియోగించే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ప్రత్యామ్నాయ పద్ధతులపై అటు రైతులు, ఇటు వ్యాపారుల్లో అవగాహన తీసుకురావడంలో అధికారులు వైఫల్యం చెందుతుండటం శోచనీయం. మామిడిలో సహజసిద్ధంగా ఇథలీన్ ఎంజైమ్ ఉంటుంది. దీని కారణంగానే కాయలో ఉండే పిండి పదార్థం చక్కెరగా మారుతుంది. దీనివల్ల పండు మాగుతుంది.



ఇది త్వరగా పక్వానికి వచ్చేందుకు ఇథరిన్ గ్యాస్‌ను వినియోగించడం ద్వారా కాయలోని సహజమైన ప్రక్రియ మరింత వేగవంతమవుతుంది. గ్యాస్ ఓ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. ఈ పద్ధతిని ప్రపంచ వ్యాప్తంగా ఆమోదయోగ్యమైనదిగా గుర్తించారు. వాణిజ్యపరంగా అధిక మోతాదులో కాయలు మాగబెట్టడానికి రైపనింగ్ ఛాంబర్స్‌ను వినియోగించవచ్చు. కాయలను ఛాంబర్‌లో ఉంచి 100 నుంచి 150 పీపీఎం ఇథలీన్ వాయువును వదిలి 12 నుంచి 24 గంటల పాటు తలుపులు తెరవకుండా ఉంచాలి. అనంతరం నాలుగు రోజులలో పక్వానికి వచ్చి మంచి రంగు వస్తుంది. ఇథరల్‌లో క్యాస్టిక్ సోడా కలపడం ద్వారా గ్యాస్ రూపంలోకి మారుతుంది. దీన్ని 100 పీపీఎం మోతాదులో వదలడం ద్వారా కాయలు పక్వానికి వస్తాయి. గాలి చొరబడని పాలిథీన్ రైపనింగ్ ఛాంబర్‌లో కాయలను ఉంచితే నాలుగు రోజులలో పక్వానికి వస్తాయి. ఇలా సురక్షితమైన పద్ధతుల్లో పండ్లను మాగబెట్టే అవకాశాలున్నా ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేలా రసాయనాలను విరివిగా వినియోగిస్తున్నా అధికారులెవరూ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

తిరుమలలో అదనపు ఈవో తనిఖీలు

ప్రజాశక్తి -తిరుమల: శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న కొబ్బరికాయలు విక్రయ కేంద్రం, టీటీడీ ప్రచురణల విక్రయ కేంద్రం, డాలర్ల విక్రయ కేంద్రాలను గురువారం ఉదయం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు.ముందుగా అఖిలాండం వద్ద ఉన్న కొబ్బరికాయలు విక్రయ కేంద్రంలో తనిఖీలు నిర్వహించి కొబ్బరి కాయల సైజును పరిశీలించారు. కొబ్బరి కాయల విక్రయంపై భక్తుల అభిప్రాయాలను ఆరా తీశారు.అనంతరం టీటీడీ ప్రచురణల విక్రయ కేంద్రానికి చేరుకున్న అదనపు ఈవో స్టాక్ ను పరిశీలించారు. అగరబత్తులు, పంచగవ్య ఉత్పత్తుల విక్రయాలను పరిశీలించారు. టీటీడీ డాలర్ల విక్రయ కేంద్రానికి చేరుకుని డాలర్ల విక్రయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

సాంకేతిక లోపాలను అధిగమించి పెన్షన్ పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పథకాన్ని లబ్ధిదారులకు ఒకటవ తారీఖున అందజేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గంలోని పైపాల్యం గ్రామంలో ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ఇది ఇలా ఉండగా నియోజకవర్గంలోనే మారుమూల ప్రాంతమైన బ్రహ్మదేవరచెన్ను గ్రామంలో పెన్షన్ పంపిణీ అందుకోవడంలో ఎదుర్కొంటున్నట్టు లబ్ధిదారులు తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గానికి దూరప్రాంతమైన తమ గ్రామంలో ప్రతినెలా ఒకటవ తారీఖున సచివాలయ సిబ్బంది వచ్చి పెన్షన్ అందిస్తున్నట్టు తెలిపారు. అయినా తమ గ్రామంలో ఎలాంటి సెల్ఫోన్ నెట్వర్క్‌లు పనిచేయకపోవడంతో, అంతర్జాలం అందుబాటులో లేక పెన్షన్ అందుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. అయితే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ అంతర్జాలం అందుబాటులో లేని బ్రహ్మదేవరచేన్ను గ్రామంలో ఆఫ్లైన్ ద్వారా పెన్షన్ అందించి, అంతర్జాలం అందుబాటులో ఉన్న ప్రాంతంలో ఆన్లైన్లో వివరాలలో పొందుపరుస్తున్నట్లు సచివాలయం సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పనులు పూర్తి చేసిందని, త్వరితగతిగా సేవలు ప్రారంభిస్తే గ్రామస్తులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతుందని గ్రామస్తులు తెలిపారు.